## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పమిడిముక్కల:** మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**గుడివాడలో..**

గుడివాడ టౌన్: పట్టణంలోని సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నందివాడ మండలంలో సైతం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

### చలివేంద్రం ఏర్పాటు



**గుడివాడ టౌన్:** మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని దొండపాడు కాల్వ వద్ద చలివేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. సంస్థ సభ్యులు జి. విజయ్‌కుమార్, నాగరాజుల సహకారంతో ఈ ఏర్పాటు చేసినట్లు సేవాసంస్థ అధ్యక్షుడు పి.వేణుగోపాలరావు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి, కార్యదర్శి ఎస్. పద్మజ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ విగ్రహ ప్రతిష్ట



**మంత్రిపాలెం(మొవ్వ):** మొవ్వ మండలం మంత్రిపాలెం గౌడ పేటలో నిర్మించిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య, నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేదమంత్రాల నడుమ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వర్ల కుమార రాజా ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మురాల శ్రీనివాసరావు-కవిత, జంపని గురవయ్య-మణి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు తులసీదాస్, రజినీకాంత్, ఆత్రేయ, చంద్రశేఖర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### హాకీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**గుడివాడ టౌన్:** అంతర్ జిల్లా ఓపెన్ నేషనల్ హాకీ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి మూడో స్థానం కైవసం చేసుకున్నారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీప్రసాద్ తెలిపారు. శుక్రవారం విజేతలైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు మొహాలీలో జరిగిన రెండో అంతర్‌జిల్లా ఓపెన్ నేషనల్ స్కేటింగ్ హాకీ పోటీల్లో తమ విద్యార్థులు జె స్నిగ్ధ, పి. కారుణ్య తమ ప్రతిభను ప్రదర్శించి మూడో స్థానం కైవసం చేసుకున్నారన్నారు. విద్యార్థులను, కోచ్ పీఎస్‌వీఎస్ అయ్యప్పను ప్రిన్సిపాల్స్ పి.సత్యరామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

### పాఠశాలల స్వరూపాన్ని మార్చొద్దు

**ముదినేపల్లి రూరల్:** విద్యాశాఖలో వింత ప్రయోగాలతో పాఠశాలల స్వరూపాన్ని మార్చడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు బేతాళ రాజేంద్రప్రసాద్ అన్నారు. ముదినేపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల స్వరూపాన్ని మార్చడం విద్యార్థులకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుందన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు విధిగా ఉండడంతో పాటు ప్రతి పాఠశాల్లో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులు మాత్రమే ఉండడంతో పాటు 30 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఉండాలన్నారు. గతంలో 3 నుంచి 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయగా ఆ తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని ఒక పక్క ఉపాధ్యాయులు కోరుతుంటే ఇందుకు విరుద్ధంగా 1, 2 తరగతులు హైస్కూళ్లలో విలీనం చేయాలని నిర్ణయించడం సరైన విధానం కాదన్నారు. ప్రాథమిక పాఠశాలలను మార్పు చేయకుండా గతంలో హైస్కూళ్లకు బదలాయించిన 3, 4, 5 తరగతులను వెనక్కు తీసుకురావాలని రాజేంద్రప్రసాద్ కోరారు.

# సమస్యల వలయంలో మంటాడ



మంటాడ-లంకపల్లి రహదారికి ఇరువైపులా ఆక్రమణలు



అధ్వానంగా మంటాడ బైపాస్ రోడ్డు

**ఓ వైపు ఆక్రమణలు, మరో వైపు డ్రెయినేజీ సమస్య**

**పమిడిముక్కల:** మండలంలోని మంటాడ గ్రామం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలో 5,200 మంది జనాభా ఉన్నారు. మేజర్ పంచాయతీ అయిన మంటాడకు రెగ్యులర్ కార్యదర్శి లేరు. రెండేళ్లుగా ఇన్‌చార్జిలతోనే కాలం గడుపుతున్నారు. మంటాడ సెంటర్‌లో ఆక్రమణలు, గ్రామంలో డ్రెయినేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు బయటకు పోయేందుకు వీలులేక అవస్థలు పడుతున్నారు.

**రోడ్డుకు ఇరువైలా ఆక్రమణలు**

మంటాడ సెంటర్ మండలంలోని పలు గ్రామాలకు కూడలి. మంటాడ-లంకపల్లి రహదారి ఇరువైపులా ఆక్రమణలకు గురైంది. ఒక వైపు డ్రెయిన్‌ను ఆక్రమించి కట్టడాలు, మరో వైపు హైస్కూల్ ప్రహరీని ఆక్రమించి పక్కా కట్టడాలు కట్టడంతో సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. వర్షాకాలంలో మురుగునీరు పోయేందుకు వీలులేక రోడ్డుపైనే రోజులు తరబడి నిలిచి ఉంటుంది.

రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఉండటంతో మురుగు బయటకు పోయే అవకాశం లేదు. ప్రయాణికులు సెంటర్‌లో నిలబడేందుకు అవకాశమే లేకుండా పోయింది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండాల్సిన పరిస్థితి. మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

**గుంతలమయంగా బైపాస్ రహదారి**

మంటాడ పెట్రోల్‌బంక్ నుంచి వెంకటేశ్వర స్వామి గుడి వరకు ఉన్న బైపాస్ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలు పడి, రాళ్లులేచి ప్రమాదకరంగా ఉంది. ఉయ్యూరుకు దగ్గర దారి కావడంతో వాహనదారులు ఈ రహదారి పైనుంచే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. చెరకు సీజన్‌లో కేసీపీకి చెరకు బళ్లు, ట్రాక్టర్లు ఈ దారిలోనే వెళ్లాల్సి ఉంది. ఎస్సీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ వాసులకు ఇదే దారి. రెడ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీలను డ్రెయినేజీ సమస్య వెంటాడుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**బైపాస్ రోడ్డును అభివృద్ధి చేయండి**



మంటాడ బైపాస్ రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డంతా గుంతలమయంగా మారింది. వాహన రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. పూర్తి స్థాయిలో రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నాం.

– మాదాసు శివకోటేశ్వరరావు, ఎస్సీ కాలనీ

**సెంటర్‌లో ఆక్రమణలు తొలగించాలి**

మంటాడ సెంటర్‌లో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలి. మురుగునీరు పోయేందుకు పక్కా డ్రెయిన్ కట్టాలి. ప్రయాణికులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకు రావాలి.

– జి.రాజ్యలక్ష్మి, మంటాడ

**ముంపు నివారణకు చర్యలు తీసుకోండి**



వర్షాకాలంలో రెడ్డిపాలెంలోని చెరువు పొంగి కాలనీ ముంపునకు గురవుతుంది. ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలి. రెడ్డిపాలెం, ఇందిరమ్మ కాలనీల్లో పక్కా డ్రెయిన్లు నిర్మించాలి.

– కంభపు లక్ష్మయ్య, మంటాడ రెడ్డిపాలెం

**ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చాం**

మంటాడ సెంటర్‌లో డ్రెయినేజీకి అడ్డంకిగా ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు అందజేశాం. కచ్చా డ్రెయిన్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. బైపాస్ రహదారి సమస్యను జిల్లా పరిషత్ దృష్టికి తీసుకెళ్లాం.

– రమణ, పంచాయతీ కార్యదర్శి

## వైభవంగా ఆనందలింగేశ్వరుడి పునఃప్రతిష్ట



ప్రతిష్ఠించిన వల్మీక సహిత ఆనందలింగేశ్వరుడు

**కైకలూరు:** వల్మీక సహిత ఆనందలింగేశ్వరస్వామి ప్రతిష్టను మార్కెట్ యార్డు ఎదుట కాలువ గట్టుపై సంతాన నాగేంద్రస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చావలి శంకరశాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన చినిమిల్లి సత్యనారాయణ, వెంకట మహంకాళమ్మ దంపతులు, చినమిల్లి ఈశ్వర్ నటరాజకుమార్, గౌతమి, రుత్విక్‌కుమార్ ఆలయ పునః నిర్మాణ ప్రతిష్ట చేయించారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

**గుడివాడ టౌన్:** అగ్నిప్రమాదాలకు అనేక అంశాలు కారణాలవుతాయని అప్రమత్తంగా ఉండటం మంచిదని డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ జి. ఆంజనేయులు అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని కృష్ణవేణి అగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

**జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ**

**పామర్రు:** వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుని అగ్ని ప్రమాదాలను అరికట్టాలని పామర్రు అగ్నిమాపక అధికారి ఎస్.రాంబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం గ్రామంలోని గ్యాస్ కంపెనీ వద్ద అగ్ని ప్రమాదాల నివారణ జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. గ్యాస్ కంపెనీ సిబ్బంది ప్రకాష్, అగ్నిమాపక, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

**కైకలూరులో..**

**కైకలూరు:** అగ్ని ప్రమాదాలపై అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్, రూరల్ సర్కిల్, టౌన్ సీఐలు వి.రవికుమార్, పి.కృష్ణ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కైకలూరు శ్యామలాంబ దేవస్థాన మండపం వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్ఐలు వెంకట్‌కుమార్, రాంబాబు, రామచంద్రరావు, ఫైర్ సిబ్బంది శ్రీను, భాస్కర్, మురళీ, గణేష్, అంజిబాబు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు చెల్లించండి



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

**గుడివాడ టౌన్:** మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు తక్షణమే బకాయి జీతాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గుడివాడ డివిజన్ పరిధిలో కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడంలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 3 వేలు జావ కాచి, గుడ్లు ఉడకపెట్టడానికి గ్యాస్‌కు సరిపోవడం లేదని ఈ నేపథ్యంలో కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లిస్తూ వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. మిడ్డే మీల్స్ సంఘం అధ్యక్షురాలు ఎం. లూర్దు మేరీ, బి. శ్రీనివాస్, ఐద్వా కార్యదర్శి పి. రజిని పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు అనుసరణీయం



గుడ్లవల్లేరులో శిలువ మార్గం నిర్వహిస్తున్న క్రైస్తవులు

**పామర్రు:** క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శిలువను మోశారు. కార్యక్రమంలో నత్తా రవి, నత్తా మురళీ, పాస్టర్లు పాల్గొన్నారు.

**పెదమద్దాలిలో..**

ఏసుక్రీస్తు ప్రజల కష్టాలను రూపుమాపేందుకు మానవ రూపంలో జన్మించి ఎన్నో కష్టాలను అనుభవించారని పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్ పేర్కొన్నారు. పెదమద్దాలిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సమ్మంగి సత్యరూతు, కాకే ప్రసాద్, దోమతోటి గ్రేసమ్మ, కాకొల్లు రాజ్యలక్ష్మీ,గుమ్మడి నవ్య, పట్టెం నాంచారయ్య, సోలే కృపమ్మ, కంచర్ల షరోన్ పాల్గొన్నారు.

**ఆర్‌సీఎం చర్చిలో..**

**పామర్రు:** క్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా పరిశుద్ధ శిలువ మార్గం అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని శిలువపై ఉంచిన ఏసు క్రీస్తును మోశారు. టీడీపీ నాయకులు గణేష్, ప్రవీణ్‌చంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మొవ్వలో..**

**మొవ్వ:** మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పాపులు రక్షణ కోసం ప్రభువు మళ్లీ లేచి వస్తారనే ఆశాభావంతో స్థానిక ఆర్సీఎం చర్చి పరిధిలోని కూచిపూడి పెదపూడి ప్రధాన రహదారిపై శిలువ మోస్తూ గీతాలను ఆలపిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పులపాక జాకబ్ ప్రసాద్ పాల్గొన్నారు.

**కైకలూరులో..**

**కైకలూరు:** గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో కైకలూరులో నిర్వహించిన ఏసు శిలువ మార్గం ర్యాలీ అందరిలోనూ భక్తి భావాన్ని నింపింది. స్థానిక ఆర్‌సీఎం ఫాదర్ గంటా ప్రవీణ్‌కుమార్ నిర్వహణలో ఎన్జీవోస్ కాలనీ, రైల్వేస్టేషన్ రోడ్, కోరుకొల్లు రోడ్, మార్కెట్‌యార్డు, సంతమార్కెట్, బైపాస్ రోడ్ మీదుగా 14 చోట్ల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మఠకన్యలు, మరియదళం, దీక్షాపరులు, సంఘ పెద్దలు, ఆర్‌సీఎం చర్చి పరిధిలోని పలు గ్రామాల నుంచి ప్రభు భక్తులు పాల్గొన్నారు.

**పమిడిముక్కలలో..**

**పమిడిముక్కల:** గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో శుక్రవారం క్రీస్తు శిలువ సువార్త యాత్ర జరిగింది. మేడూరు నుంచి లంకపల్లి, కృష్ణాపురం, పమిడిముక్కల, వీరంకిలాకు మీదగా దేవరపల్లి వరకు యాత్ర సాగింది. ఈ యాత్రలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**తోట్లవల్లూరులో..**

**తోట్లవల్లూరు:** మండలంలోని పలు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని చర్చిలలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురివిందపల్లి, దేవరపల్లిలో రెవరెండ్ రాజారత్నం ఆధ్వర్యంలో క్రీస్తు శిలువయాత్ర జరిగింది.



పామర్రులో శిలువను మోస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



మొవ్వ ఆర్‌సీఎం చర్చిలో పాల్గొన్న భక్తులు



ముదినేపల్లిలో శిలువయాత్ర



కైకలూరులో శిలువమార్గం నిర్వహిస్తున్న ఫాదర్



పామర్రులో శిలువను మోస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్



మేడూరులో క్రీస్తు శిలువ సువార్త యాత్ర



దేవరపల్లిలో శిలువయాత్ర

**గుడ్లవల్లేరులో..**

**గుడ్లవల్లేరు:** గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని గుడ్లవల్లేరు ఆర్సీఎం చర్చి ఫాదర్ మ్యాథ్యూ ఆధ్వర్యంలో శుక్రవారం శిలువ మార్గాన్ని ఏసు విశ్వాసులు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంబడి నిర్వహించిన ఈ శిలువ మార్గంలో ఏసు కీర్తనలను ఆలపిస్తూ విశ్వాసులు కొనసాగారు.

**ముదినేపల్లిలో..**

**ముదినేపల్లి రూరల్:** మండలంలో గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శిలువయాత్రలను నిర్వహించారు. ముదినేపల్లిలో ఆర్సీఎం చర్చి ఫాదర్ కమతం మరియదాసు ఆధ్వర్యంలో పలువురు పాస్టర్లు, అధిక సంఖ్యలో విశ్వాసులు శిలువయాత్ర నిర్వహించారు.

**నందివాడలో..**

**నందివాడ:** మండలంలో గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పోలుకొండ గ్రామంలో క్రైస్తవులు శిలువ మోస్తూ తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ అనిల్‌బాబు పాల్గొన్నారు.

**మండవల్లిలో..**

**మండవల్లి:** మండవల్లిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా భైరవపట్నం విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ శాంత్‌రాజు ఆధ్వర్యంలో మండవల్లి ఆర్‌సీఎం చర్చి నుంచి భైరవట్నం విచారణ వరకు శుక్రవారం శిలువ యాత్ర నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ ప్రదీప్, రెవరెండ్ ఫాదర్ ఆనంద్ పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

**వెండి వస్తువులు, 20 కేజీల రాగి వైరు స్వాధీనం**



చోరీ సొత్తును మీడియాకు చూపుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

**గుడివాడరూరల్:** సాయిబాబా మందిరంలో చోరీ చేసిన నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న ఎస్‌ఐ ఎన్.చంటిబాబు, సిబ్బందిని గుడివాడ డీఎస్పీ వి.. ధీరజ్ వినీల్ శుక్రవారం అభినందించారు. స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో విలేకరులో సమావేశంలో ఆయన చోరీ వివరాలను వెల్లడించారు. గుడివాడ మండలం దొండపాడు కాలనీ శ్రీదేవినగర్‌లోని సాయిబాబా మందిరంలో ఈనెల 14వ తేదీన శ్రీకాళహస్తీకాలనీకి చెందిన పుప్పాల ప్రభుకుమార్ అనే యువకుడు రూ.2లక్షల విలువ చేసే కిలోన్నర వెండి వస్తువులు దొంగిలించారన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు సీఐ పర్యవేక్షణలో ఎస్‌ఐ చంటిబాబు దర్యాప్తు ప్రారంభించి చాకచక్యంగా శుక్రవారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారన్నారు. అతడి వద్ద నుంచి రూ.1.50 లక్షల విలువైన కేజీన్నర వెండి వస్తువులతో పాటు బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చెందిన సుమారు రూ.50 వేలు విలువైన 20 కిలోల రాగి వైరును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై గతంలో భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, రాజానగరం పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ చంటిబాబు, సిబ్బందికి డీఎస్పీ రివార్డులు అందజేసి అభినందించారు. సమావేశంలో తాలూకా సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## ఐఎంఏ నూతన కార్యవర్గం ఎంపిక

**గుడివాడ టౌన్:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) గుడివాడ శాఖ నూతన కార్యవర్గ ఎంపిక శుక్రవారం జరిగినట్లు అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్ తెలిపారు. నూతన అధ్యక్షుడిగా డాక్టర్ మాగంటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ పునుకొల్లు శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ దేవరపల్లి సూరజ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉండవల్లి సురేష్‌బాబు, ఉప కార్యదర్శి డాక్టర్ ఎం. సుందరయ్య ఎంపికైనట్లు పేర్కొన్నారు.

## గుర్రపుడెక్క తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



గుర్రపుడెక్క తొలగించిన తరువాత బందరు కాలువ

**తోట్లవల్లూరు:** తోట్లవల్లూరు-ఉయ్యూరు ప్రధాన రహదారిలోని బందరు కాలువలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగింపుకు అధికారులు ఎట్టకేలకు చర్యలు తీసుకున్నారు. సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన గుర్రపుడెక్క, తూటుకాడ సమస్యపై ఈ నెల 16న సాక్షిలో 'గుర్రపుడెక్క ఇలా..సాగునీరు పారేది ఎలా' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఇరిగేషన్ కంకిపాడు ఏఈఈ నాగబాబు స్పందించి గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. పనులను ఇరిగేషన్ అసిస్టెంట్ శేషగిరిరావు పర్యవేక్షించారు.

## నూతన వధూవరులకు అనిల్‌కుమార్ ఆశీర్వాదం

**పామర్రు:** వైఎస్సార్ సీపీ నాయకుడు ముప్పంగి నరేష్‌రెడ్డి కుమార్తె వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శుక్రవారం రాత్రి పాల్గొన్నారు. స్థానిక బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మండపంలో జరిగిన వేడుకలో అనిల్‌కుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, రమాదేవి, నాయకులు బాల వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సత్తిరెడ్డి, శశిధర్‌రెడ్డి, అంజిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## చేతి పంపు మాయం



**ముదినేపల్లి రూరల్:** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన చేతి పంపును గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి మాయం చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు వైఎస్సార్ సీపీకి చెందిన మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు రెండు బోర్లు వేసి, చేతిపంపులు ఏర్పాటు చేశారు. వీటిని గతంలో మాయం చేయగా తిరిగి రెండు పంపులు వేయించారు. ఇవి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గురువారం రాత్రి ఒక చేతిపంపును మాయం చేశారు. దీనిపై దాత అల్లాభక్షు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## క్రీడాకారులకు సత్కారం



**గుడివాడ టౌన్:** స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా కోచ్‌లు మార్నెళ్ల వెంకటేశ్వరరావు, మహ్మద్ సైదా మాట్లాడుతూ గుడివాడ పట్టణంలో మొట్టమొదటి సారిగా క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయన్నారు. 10 మంది జిమ్ క్రీడాకారులు వివిధ కేటగిరిల్లో బహుమతులు సాధించారన్నారు. వీరిలో ఇద్దరు మధ్యప్రదేశ్‌లో మే నెలలో జరిగే ఆల్ ఇండియా సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారని తెలిపారు.